# పాపం! పూలకృష్ణయ్య!

రచన:
" నిత్యసంతోషి "

తెల్లటి పొగమంచు తుంపర తుంపరగా గాలిలో తేలుతూ దట్టంగా అలుముకొని, దూరపు వస్తువుల్ని చూపుకు ఆనకుండా చేస్తోంది. కాస్తదూరంలో, కపిల బావిచుట్టూ వున్న బాగిచెట్ల పచ్చదనంకూడా ఆ మంచు తెరలతో కప్పుకుపోయి, గుడ్డిగానే కనిపిస్తోంది.

చేతికర్ర ఊతగా వడవడ వణుకుతూ చిన్నగా, చిరుగాలికి పడిపోయేటంత తేలిగ్గా నడిచిపోతున్నాడు కృష్ణయ్య. కోతల తర్వాత మిగిలిపోయివున్న పైరుమొక్కలు, చిక్కగా మొలిచిన పచ్చిక పాదాలను జిల్లుమనిపించి, శరీరమంతటికీ చలిని సరఫరా చేస్తున్నాయి. చలిమంచు — పాపపుణ్యాలను విచారించి శిక్షించే యమునిలా నిర్దయగా, నిర్దాక్షిణ్యంగా అతని ముసలి శరీరాన్ని అంపంతో కోసినట్లు కొరుక్కుతింటోంది.

కృష్ణయ్య రోడ్డుమీదికి వచ్చాడు. ఊరు వెనుకబడింది. ఊరువిడిచి వీధుల్లోంచి వెళ్లడము అతనికి అవమానకరంగా తోచింది. పురజనులందరూ తన్ను వేలెట్టి చూపుతూ హేళనగా నవ్వుతారేమోనన్న కించకలిగింది. అందుకే అతను వీధుల్లోంచి వెళ్ళలేదు. అడ్డదార్లుత్రొక్కి, పొలంగట్లవెంబడే నడిచి, ఊరు చుట్టుకొని, అలా రోడ్డుమీదికి వచ్చాడు.

వెనక్కుతిరిగి ఎక్కడో దూరానికేసి తీక్షణంగా చూస్తూ కొంతసేపు నిలబడ్డాడు. తన యిల్లు, భార్యతో, కొడుకూ కోడళ్ళతో, బుల్లి మనుమలతో ఆనందచంద్రికల్ని వెదజల్లుతూ వుండవలసిన యిల్లు కంటబడిందికాదు. ఎక్కడో చెట్లచాటున మరుగుపడిపోయింది.

విరాగికి ప్రాపంచికపుచింతలతో పనిలేదు. ఆ ఊహతోనే అతను తననుండి జారిపోయే ధైర్యానికి ఆనకట్టకట్టి, పచ్చే దుఃఖాన్ని బలవంతాన నిలద్రొక్కుకోగలిగాడు. ఆ ప్రయత్నములో అతనిముఖం కందగడ్డలాఎర్రబారింది.

ఒక ఫర్లాంగుదూరం నడిచి రైలుగేటుదగ్గరకు రావడంతో అతనికాళ్లకు బ్రేకులుపడ్డాయి. రోడ్డుమీద ఎప్పుడూ ఎవరో ఒకరు నడిచివెళ్తూనే వుంటారు. తననుగురించి తెలియనివాళ్లన్న తెలిసినవాళ్లే ఎక్కువమంది ఆ ప్రాంతములో. కనుక తన ఆచూకీ బయటపడకపోదు. ఫలానా పూలకృష్ణయ్య చేతులుకాల్చుకుని, బ్రతకడం చేతగాక యిల్లువిడిచి వెళ్ళిపోతున్నాడురోయ్ అని నలుగురూ అనుకుంటే తనకు అంతకన్నా తలవంపులు మరొటిలేదు. కృష్ణయ్య ఏమయ్యాడో ఎవరికీ తెలియకూడదు.

రైలుకట్టమీద వెళ్లితే ఎవరూ చూడరు! రైలుకట్టపొడుగునా అటూ యిటూ చిట్టడివే.

రైలుకట్టను అనుసరించాడు కృష్ణయ్య. మంచుతెరలు మెల్లమెల్లగా విచ్చిపోతున్నాయి. తూర్పుదిక్కున పసిడికాంతులు పరచుకొంటున్నాయి. చలి అణగక దుప్పటి మరీ గట్టిగా కప్పుకున్నాడు.

తాను ఎక్కడికి పోతున్నాడు? ఎక్కడికో తనకే తెలియదు. ఎక్కడికైనా సరే, వెళ్ళిపోవాలి! మొత్తంమీద ఈపాకాలకు దూరంగా వెళ్ళిపోవాలి.



ప్రక్కన — తుమ్మచెట్లో పిట్ట ఎక్కడికో వెళ్ళిపోతున్నది. పాపం! అది మళ్ళీ రాదా? ఎందుకు రాదు? తప్పక వస్తుంది. దానిపిల్లల కోసమైనా రావాలి!

తనకూ వున్నాడు కొడుకు, కాని, తాను వెనుదిరిగిపోడు. వాడు తన కొడుకు అని పదిమందితోనూ సంతోషంగా చెప్పుకోలేడు. "నాయనా—నా తండ్రీ!" అంటూ వాణ్ణి కౌగలించుకొని ఆనందించడానికి తాను నోచుకోలేదు. తండ్రి ప్రాపులేకుండా పెరిగిన అనాథుడిదగ్గరకు—"నేను నీ తండ్రిని" అని ఏ మొహంతో వెళ్ళగలడిప్పుడు?

అందుకే మరెక్కడికో వెళ్లిపోతున్నాడు!

ఉదయాతపం కృష్ణయ్య చలిని పోగొట్టడానికన్నట్లు అతనిమీదికి అల్లుకొంది. చెట్లమీద పరచుకొన్న మంచు ఉదయకిరణాల తాకిడికి కరగి, నీటిముత్యాలై క్రిందికి రాలుతోంది.

రైలుకట్టప్రక్కన కాలిబాటలో చింతచెట్టు క్రింద ఎవరో పల్లెటూరి దంపతులు పోట్లాడుకుంటుంటే ఆగి, అరచేయి నొసటిదగ్గరజేర్చి, వారికేసి పరామర్శగా చూశాడు.

ఆమె జుట్టంతా రేగిపోయివుంది. ముఖం పీక్కుపోయింది. ముఖంలో ఏదో మొండిపట్టుదల కనిపిస్తోంది. ఆ ముఖత్వాన్ని సూచిస్తున్నట్లు ఏదేదో పిచ్చిపిచ్చిగా వాగుతోంది. మగవాడు ఆమెను పటిలాగాడు. బలంగా రెండు గ్రుద్దులుగ్రుద్దాడు. కర్కశంగా తిడుతున్నాడు. భయంకరతం... స్తున్నాడు.

వాళ్లకు దగ్గరగా వెళ్ళాడు కృష్ణయ్య. ఒక బలిష్ఠుడు ఒక అబలను అలా హింసిస్తుంటే అతని మనస్సొప్పిందికాదు.

"ఎందుకయ్యా పాపం అలా కొడ్తున్నావ్ ఆవిణ్ణి?" అన్నాడు.

"చూడు బాబూ! ఈ రంకుముండ నిన్న నంగా యింట్లోంచి పారిపోయివచ్చేసింది. ఎంతగా వెతికానని దీనికోసం? ఇప్పుడు యింటికి రాయే అంటే రానని కూర్చుంది. ఒసేయ్, సిగ్గులేందానా! ఇలాగే వూళ్ళు తిరగతావుంటానంటివో నడ్డివిరగదంతా! మర్యాదగా యింటికిరా!" అంటూ మళ్ళీ ఆమెను పట్టిలాగాడు ఆ పల్లెటూరాయన.

"నేనేమీ సిగ్గిడిసిందాన్నికాను. సిగ్గూ శరం లేనివాడివి నువ్వే. నన్ను ముక్కలు ముక్కలుగానరికినా నేనేమో నీయెంటరాను" అనేసింది ఆవిడ కుండ బ్రద్దలుగొట్టినట్లు.

"చూడు బాబూ! దీని గయ్యాళితనం? నేనంటే ఖాతరులేదు దీనికి! దీన్ని చీల్చినా పాపంలేదు" అంటూ పళ్ళు పటపట కొరికాడు ఆమె మొగుడు.

"అయినా అంత దౌర్జన్యమా? అలా గట్టిగా దండిస్తే ఆడది హడలిపోదూ? మంచిమాటలతో నచ్చజెప్పాలి గాని" అంటూ సంధి ప్రయత్నం ప్రారంభించాడు కృష్ణయ్య.

"హడలిపోతుందా? మొగుణ్ణే మింగేస్తుంది యిది. దీని గుండె ఎంత గట్టిదిగాకపోతే యింట్లోంచి పారిపోయివస్తుంది?" అని రొప్పుతున్నాడు అతను.

"నేను రానంటే రాను. ఆ కొంపలో వుండలేను నేను. ఏ అడివిలోనైనా దిక్కులేకుండా చావచ్చుగాని, నీతో సంసారంమాత్రం చేయలేను...."

"అలా మొండికేసుకుంటే ఎలాగమ్మా? ఇంటికెళ్లక మరెక్కడికెళ్తావు? ఏదో యింటి గొడవలు ఇంట్లోనే అణిచేసుకోవాలిగానీ, ఇలా రచ్చకెక్కించుకోవడమా? తొందరపడబోకు. అతనంతగా పిలుస్తున్నాడు వెళ్లమ్మా! వెళ్లు!"

"మీకేం దెలుస్తుంది బాబూ! యింట్లో రగడలు? చూసేవాళ్ళకేమో నేను చెడ్డదాన్ని. పుట్టించినదేవుడు నన్ను చంపేయకపోయాడు. ఏం సుఖం అనుభవిద్దామని బతికున్నానో యింకా? సంపాయించిన డబ్బంతా పేటలో ముండలకుబెట్టి ఇలామక్కెలిరగ్గొట్టి నాకడుపు మాడుస్తాడు. ఒకనాడా, రెన్నాళ్ళా? బతికినంతకాలమూ! ఛీ! ఎంతవరకని ఓపికపట్టను? నా మనసు రోసిపోయింది. అన్నీ తెంపుకునే వచ్చేశాను. నన్నింకా మింగి నీళ్ళుతాగడం దేనికి?"

కృష్ణయ్య విస్తుపోయాడు. అందమైన పెళ్ళాం ఇద్దరికీ యీడూ జోడూ చక్కగా వుంది. కానీ ఎందుకా మనిషిలో అంతటి రాక్షసత్వం? ఇంట్లో ఆడదాన్నిబట్టుకొని బానిసను హింసించినట్లు హింసించడమా? ఆమె భర్తమీద చాలా అసహ్యంవేసిందతనికి.

"ఏమయ్యా! నీకుతెలివుందా? నా మాటకు కోపగించకు! చేసేది నీతిమాలినపని. పైగా బంగారువంటి పెళ్లాన్నిజూసి కంట్లోకారంజల్లుకోవడమా? ఛీ! ఛీ! ఏం పాడు బుద్ధులయ్యా! ఇటువంటి బుద్ధి తక్కువపను లింకమీద చెయ్యకు. ఆవిణ్ణి తీసుకెళ్ళి యింట్లో వుంచుకుని తెలివిగలిగి బతుకు" అంటూ హితోపదేశంచేశాడు కృష్ణయ్య.

ఆ పల్లెటూరి ఆసామీకి కోపం మరీ రెచ్చిపోయింది. 'చాల్చాల్లేవయ్యా పూలయ్యా! ఇంటగెలిచి రచ్చగెలవమన్నారు. నీ కన్నా పెద్ద తప్పుడుపనేం చెయ్యాలేదులే నేను. నీకు మల్లే లక్ష్మీవంటి పెళ్ళాన్ని యింట్లోంచి వెళ్లగొట్టేయలేదు. సీతమ్మవారిలా ఆమె యిడుములుబడుతోంటే చూస్తూ వూరుకున్నావు. నీ దారిన నువ్వు బో. నా పెళ్ళాన్ని అదుపులో బెట్టుకుంటుంటే నువ్వెవడివి మధ్యని?.... ఒసేయ్! ఒస్తావా, చంపుదునా? నాకు టోకరా యిచ్చి పోవటానికి, నేనేం గుడ్డోణ్ణికాను రా! ఇంటికి రా నీపని చెబుతాను!" అంటూ ఆమె విలవిల తన్నుకుంటున్నా విడిచిపెట్టక, గొడ్డును లాక్కెళ్ళినట్టు బరబరా యీడ్చుకెళ్ళాడు అతను.

అతనిమాటలు కృష్ణయ్యగుండెలను శరాలకుమల్లే తాకాయి. నిర్విణ్ణుడై నిలబడిపోయాడు కొన్ని క్షణాలపాటు. ఇదివరకే అతని గుండెల్లో రగులుతున్న వ్యథాగ్ని ఆ మాటలపోట్లతో అగ్నిలో ఆజ్యంపోసినట్లు భగభుగలాడిపోయింది.

వీడెవడో తన్ను బాగా ఎరిగివున్నాడల్లేవుంది. లేకపోతే తన వ్యక్తిగతవిషయాలంతా కథలా ఏకరువుపెడతాడా? అనవలసినమాటేదో నిబ్బరంగా మొహాన్నే అనేశాడు. కుంటివాడు మరో కుంటివాణ్ణి వెక్కిరించినట్లు తనలో తప్పులుంచుకొని, ఎదుటివాడి తప్పుల్ని ఎత్తి చూపడం ఎంత అవివేకం! వాడు ఆమెను కొట్టినా తిట్టినా యింట్లో ఆశ్రయమైనా యిస్తున్నాడు. తాను? అగ్నిసాక్షిగా వివాహమాడిన అర్ధాంగి ఒడినిందుకూ ద్రోహాన్ని మూటగట్టి నిష్కారణంగా యింట్లోంచి సాగనంపాడే ఎవడు అవినీతిపరుడు?

ఆ గ్రామీణుని కారుకూతలు, ఆవిడ ఆక్రందనాలు క్రమంగా దూరమైపోయాయి. కృష్ణయ్య మళ్ళీ రైలుదారి వెంబడి ముందుకు సాగాడు.

తానూ ఒక మానవుడు! మానవాళిమీద అతనికి అసహ్యం పెల్లుబికిపోయింది .... ఛీ! లోకం ఎందుకిలా పాడైపోతోంది? మనుషుల్లో ఎందుకిటువంటి విపరీతపు బుద్ధులు? మంచీ చెడూ, న్యాయం-అన్యాయం, ధర్మం-అధర్మం, నీతి - అవినీతి అన్న విచక్షణా పరిజ్ఞానం బొత్తిగా నశించిపోతోందేం? అడుసు త్రొక్కనెందుకూ, ఆటుపిమ్మట కాళ్లు కడుగుకోనెందుకు? శాంతం, సౌమ్యం, నిదానం, దూరదృష్టి — యివి లేనివాడు ముందు ముందు బహు అనర్థాలను ఎదుర్కోవలసిన వాడౌతాడు. ఫలితాన్ని స్వయంగా చూసినప్పుడు గానీ—స్వయంకృతంలోని మంచి చెడుగులు తెలిసిరావు. మూర్ఖంతో, అంధకారంతో మిడిసే వాడికి ఎప్పటికైనా కనువిప్పు కలుగకపోదు. కాని అప్పుడు ఎంత పశ్చాత్తాపం, పరితాపం పొందినా-ప్రాయశ్చిత్తంకోసం వెతుకులాడినా- అది చేతులు కాలింతర్వాత ఆకులు పట్టుకోవడమే అవుతుంది.

పదునుదనపు నెత్తుటి ఉడుకుతో తాను చేసిన అకృత్యం తనజీవితంలో ఒక మాయని మచ్చగా నిలిచిపోయింది. సంఘం తన్ను చూసి ఛీదరించుకుంటుంది. వాడిటువంటి వాడు అని వేలెట్టి చూపుతుంది. కంటికెదుట మర్యాదతో నవ్వుతూ మాట్లాడినివ్యక్తి వెనుక నుండి స్వగతంతోనే దూషిస్తాడు .... "దేవుడంటూ ఒకడున్నాడుకదా! అంతా వాడు చూస్తూనేవున్నాడు. ఇటువంటి పాపకర్ములను తగినవిధంగా శిక్షిస్తాడులే...." తనకు విధించవలసిన శిక్ష ఎటువంటిదో మానవబుద్ధికి తోచనట్లు ఆ భారాన్ని భగవన్నిర్ణయానికి విడిచిపెట్టే సంఘంమాటలను తాను పలుభంగుల్లో విన్నాడు. అందుకే సంఘంతో హత్తుకుపోలేకపోయాడు. సంఘం కన్నులలోకి సూటిగా చూడలేకపోయాడు.

ఇదంతా ముసలితనంలో కలిగిన పరివర్తన. ఎంతలో తలమాడితేనే కాని, తరుచ్ఛాయలోని చల్లదనపుసౌఖ్యం తెలియదు.... మంచిని గురించి చెడ్డలో నడిచిపోయినవాడికి తెలిసినంత బాగా మరొకడికి తెలియదు.

(వచ్చే సంచికలో ముగింపు)

# పాపం! పూలకృష్ణయ్యా!

రచన:
" నిత్యసంతోషి "

(గత సంచిక తరువాయి)

వయస్సులో కృష్ణయ్యా మంచి అందగాడు. అందానికి మించిన సద్గుణ సంపన్నుడు. దుర్వ్యసనాలకు దూరుడు. పూలకు మల్లెనే పరిమళహృదయుడు. పూలతోకూడిన దారానికి వాసన వచ్చినట్టు — పూలమ్ముకు బ్రతికే కృష్ణయ్యాతో చెలిమిచేసే వారి మీద కూడా అతని సుగుణప్రభావం సోకేది.

ఇరవై ఎనిమిదేళ్ళు పైబడినా పెళ్లీపెడాకులు లేకుండానే వుండిపోయిన కృష్ణయ్యా - కరణం గోవిందయ్యా దృష్టిలో పడ్డాడు....

పాకాల - పది పదిహేను పూరి కొంపలతో, కీచురాళ్ళ రొదతో చెవులు గింగురులెత్తించే తుమ్మచెట్ల డొంకలతో, ఎర్రటి దుమ్ముతోనిండి ఎగుడుదిగుళ్ళుగా వున్న రాళ్లగుట్టలతో-అడివి కొంపగావున్న రోజుల్లో - బ్రిటీషు దొరతనానికి చేతులుజోడించి, కొండలన్నీ పిండిజేసి, మిట్టాపల్లం ఏకంజేసి గోవిందయ్యా గొప్ప భూస్థితి సంపాదించుకొన్నాడు. ఊళ్ళో కమ్మనాయుళ్లతో ఎడతెగని స్నేహం వుండంవల్ల-పలుకుబడికి లోటులేదు. కాని - అతనికి మగసంతానం అన్నది లేదు. నలుగురూ ఆడపిల్లలే! ముగ్గురు కూతుళ్ళను దూరప్రాంతాల్లో ఇచ్చినాడు. చిన్నకూతురు నాగమ్మే యిక మిగిలి వుంది. ఆమెకు ప్రాయం వచ్చేసరికి - గోవిందయ్యాకు దిగులు పట్టుకుంది. తనకా - వయస్సైపోతోంది. ఆప్తులంటూ ఎవరూలేరు. మిగిలివున్న ఒక్క కూతుర్నీ యింకెక్కడో యిచ్చాడంటే తాను ఒంటరిగా మిగిలిపోతాడు. వార్ధక్యంలో తనకు అండ అంటూ వుండదు. అందుకే-అతని ఆలోచనలు కృష్ణయ్యామీదికి మళ్లేసరికి - పేదవాడికి పెన్నిధి దొరికినంత సంతృప్తి కలిగింది. అసలు - కృష్ణయ్యా స్థితి మంతుడేమీకాదు. వజ్జావారి వీధిలో మూడేసి అంకణాల పూరిళ్ళు రెండు-చుట్టూరా కొంత ఖాళీస్థలం అతని కున్న ఆస్తి. బజారులో పూలదుకాణం వుంది. పూలదండలు కట్టడంలో మంచి దిట్ట. మంచి వ్యాపారం. ఇది చాలు-తన కూతురు సుఖంగా జీవించటానికి. ఇంకా సంబంధ ప్రయత్నాలైనా చేయుటకు ముందే - కృష్ణయ్యా తల్లి వున్నట్టుండి చనిపోవడంతో - అది గోవిందయ్యాకు మరీ మేలనిపించింది. ఇక నాగమ్మకు అత్తపోరు కూడా ఉండబోదనుకున్నాడు.

ఈసంబంధం చాలమందికి నచ్చింది కాదు. ఒక విధంగా కృష్ణయ్యా బికారివాడు. గోవిందయ్యాతో సరితూగలేడు. కనుక అందరికీ ఈ అతుకు అతుకుగానే కనిపించింది. చాలమంది మోతుబరి రైతులు, భూస్వాములు చెప్పిచూశారు. మునసబుకూడా ఒకసలహాఇచ్చాడు. "గోవిందయ్యా! పెళ్ళికొడుకులకిదేం కరువు కాలమా?.... మంచి సంబంధాలు దొరక్క పోయాయా?.... నా ఎరుకలోనే కోకొల్లలున్నాయిగా!.... ఉత్తర అర్కాటు జిల్లాలో ఒక కుర్రాడు. ఐదెకరాల కొబ్బరితోట! చక్కటి డాబా యిల్లు! తాలూకాఫీసులో గుమస్తాగిరీ! త్వరలోనే తాసీల్దారు కాగల అవకాశమూ వుంది.... అదృష్టం ఆక్కడుందిగాని-ఇక్కడేముంది?.... సింహపుగుహలో దూరితే ఏనుగ దంతాలు దొరకుతాయిగాని-నక్కబొరియలో ఏముంటుంది. గోవిందయ్యా?.... ఎండ్రకాయ బొచ్చెలు!...." గోవిందయ్యా వినలేదు. తా మునిగిందేగంగ అన్నాడు.

మొత్తం మీద పెళ్లిజరిగిపోయింది. దేవుడు దిగివచ్చి వరమిస్తానంటే వద్దనే వాడెవడూ వుండడు. కృష్ణయ్యా మురిసిపోయాడు. కొత్త పెళ్ళాంతో కాపురం పెట్టాడు.

గోవిందయ్యాకు నెత్తిమీదినుండి పెద్దకొండ దింపినట్లైంది. కూతురు తన కన్నెదుటనే వుంటుంది. తన కిక ఏ బెంగా లేదు. ఇక ఎంతోకాలం బ్రతకడు తాను. కాని - పుట్టిన మట్టిలోనే కలసిపోతా నన్న తృప్తి మిగిలింది. బిడ్డలకు దూరంగా దిక్కులేని చావు చావాల్సిన గతిమాత్రం పట్టదు. ఇక రామా, కృష్ణా అనుకుంటూ శాంతంగా రోజులు వెళ్లబుచ్చాలనుకున్నాడు.

రెండేళ్ళ జీవితం పచ్చగానే గడిచిపోయినది. నాగమ్మకు పూరింట్లో, కృష్ణయ్యా భర్తృత్వంలో కొఱత కించిన్మాత్రమైనా కనిపించింది కాదు. వారి దాంపత్యం, అన్యోన్యానురాగం అందరికీ చూడ ముచ్చట గొలిపేది.

అటువంటి కృష్ణయ్యా ఉన్నట్టుండి అలా మారిపోతాడని ఎవరూ కలలోనైనా వూహించ లేదు.

* * *

ఒకనాడు యింట్లో దీపం వెలిగించి, భర్త కోసం గుమ్మంలో నిలబడి ఎదురుచూస్తోంది నాగమ్మ. జాముర్రాత్రి గడిచాక యింటికి వచ్చాడు కృష్ణయ్యా అతని వెనుక - మాసిన చీరతో, చంకన చంటివాడితో ఒక యువతి నిలబడివుంది. వయస్సు సుమారు ఇరవై సంవత్సరాలుంటాయి. కృష్ణయ్యా ముఖంలోని తడబాటును పసిగట్టలేక పోయింది నాగమ్మ. అతనితో వున్నావిడ ఎవరో బంధుగాబోలనుకుని మర్యాదలు జరపడానికి యింట్లోపలికెళ్లింది. కాని భర్త లోపలికి రాలేదు. చెప్పులు విడిచి, గబగబ రెండో యింటిలోపలికెళ్లి, వెంట వున్నావిడను అందులో దిగవిడిచి వచ్చాడు.

"ఎవరండీవారు ? .... " అంది నాగమ్మ కొంగు నోట్లోపెట్టుకుని తన పెద్దకళ్ళతో అతని కేసి చూస్తూ.

"చెబుతానులే! నీళ్ళుతోడు" అన్నాడు.

నాగమ్మ పెరట్లోకి వెళ్లి అతనికి వేడినీళ్ళు తోడింది. అతని వీపురుద్దుతూ "ఆవిడ ఎవరో చెప్పరాండీ?" అంది.

కృష్ణయ్యా మౌనంగానే వున్నాడు.

"ఊఁ?" అంటూ మళ్ళీ రెట్టించింది నాగమ్మ.

"ఎవరో మనకెందుకు? ఇల్లుగావాలంటేను తీసుకొచ్చా...."

నాగమ్మకన్నులు ఆశ్చర్యంతో రెప రెపలాడాయి .... "ఇల్లుగావాలంటే అద్దెకొంపల్లేక పోయాయా?"

"ఏం? మనిల్లు ఎందుకివ్వగూడదూ?"

"మనిల్లా? బాగుంది. మనకే చోటుచాలక యేడుస్తుంటే—ఉన్నయిల్లుకూడా అద్దెకిచ్చుకోవడమా ? .... అయినా మనమధ్యని వేరే కాపురా లేమిటండీ? పాడు...."

"రెండిళ్ళు మనకెందుకు లే? ఒకటి చాలదూ? ఇన్నాళ్ళూ అద్దెకిచ్చుకోలేదు. ఇప్పుడిస్తేఏం? డబ్బూ కలిసొస్తుంది. నువ్వూరుకో! అంతా నాకు తెలుసులే!"అన్నాడు కృష్ణయ్యా. అతను మాట్లాడుతున్నంతసేపు భార్యకు ముఖం చూపలేకపోయాడు.

నాగమ్మ తర్వాత భర్తను ఏమీ ఒత్తిడి చేయలేదు. స్నానంముగిశాక భోజనంవడ్డించి అతన్ని పిలిచింది. "కాస్సేపుండి భోంచేస్తా" నంటూ బయటికి వెళ్లిపోయాడు కృష్ణయ్యా.

అతని ప్రవర్తనలో ఏదో మార్పు కనిపించింది నాగమ్మకు. విస్తుపోయి గుమ్మం దగ్గరే నిలబడిపోయింది. భర్తతో వచ్చినావిడెవరో మళ్ళీ బయటకు రానేలేదు. సద్దూ చప్పుడూ లేకుండా లోపలే వుండిపోయింది. ఆ యింట్లో తనవీ, తన భర్తవీ మంచాలూ, పరుపులూ వున్నాయి. పోయి తెచ్చుకోవాలనిపించింది. కాని, ఏమిటో అక్కడికి వెళ్లబుద్ధి వేయలేదు.

కాస్సేపట్లో కృష్ణయ్యా తిరిగి వచ్చాడు. గుమ్మంలో నిలబడ్డ నాగమ్మకేసిచూచి, తొట్రుపడ్డాడు. అతనిచేతిలో ఏవో పొట్లాలున్నాయి.

అతను వెకిలిగా నవ్వుతూ ప్రక్కయింటిలోకి వెళ్ళి, రెండు నిమిషాల తర్వాత తిరిగి వచ్చాడు. అతనుఆవిడకిచ్చివచ్చినపొట్లాలు ఏవో తినుబండారాలు గాబోలనుకున్నది నాగమ్మ.

కృష్ణయ్యా భోజనంచేస్తున్నంతసేపు ఇద్దరూ మౌనంగానేవున్నారు. అతను చేయికడుక్కుని లోపలికివచ్చాక అంది నాగమ్మ "ఏమండీ! సామాన్లంతా ఆ యింట్లోనే వున్నాయి ఎలా?"

"ఔను?...." అంటూ కనుబొమలు చిట్లించాడు కృష్ణయ్యా. "ఉంటే ఏమయిందిలే? రేపు ఎప్పుడైనా తెచ్చుకోవచ్చు. ఇప్పుడు పరుపూ, దుప్పటిమాత్రం తెస్తా నిద్దరొస్తోంది" అని పరుపూ, దుప్పట్లుమాత్రం తెచ్చాడు.

ఆరాత్రి ఆలోచనలతాకిడికి నాగమ్మను నిద్రపోనీయలేదు. భర్త ఎప్పుడూ లేనంతగా గుర్రుతీస్తున్నాడు. రెండు మూడుసార్లు తన వేపుచూచి 'నిద్రపట్టలేదూ?' అన్నాడు

ఇంతకూ ఆ క్రొత్తమనిషెవరు? చూస్తే ముత్తయిదువగానే వుంది కానీ — ఒక్కతే వుందేం? మగవాళ్లంటూ ఎవ్వరూ లేరా? ఇటువంటివాళ్ళకా యిల్లు అద్దె కివ్వడం? మంచివాళ్లెవరూ దొరక్కపోయారా? అసలు యిల్లు అద్దెకిచ్చుకోవలసిన అవసరమే మొచ్చింది? వయస్సులోవున్న ఒంటరి ఆడది. తాడూ బొంగరం లేనిదానికి ఆశ్రయమిచ్చాడెం తన భర్త? చూసినవాళ్లు ఫక్కుమని నవ్వరూ?

అవతలింట్లోనుండి ఉన్నట్టుండి గాజుల చప్పుళ్ళు, పొడిదగ్గులు, ఆవులింతలు ఏమిటీ సంజ్ఞలూ, సంకేతాలు?

నాగమ్మకు ఎక్కడలేని కోపం వచ్చింది. ఉన్నపాటున లేచివెళ్ళి "ఇదిగో నమ్మోయ్! అర్ధరాత్రికావస్తున్నా నిద్రపోక—ఇదేమిటీ నీ దగ్గులూ, మూలుగులు? ఇది సంసారికొంపను కున్నావా, మరేమైనా అనుకున్నావా?" అంటూ నాలుగు చీవాట్లుపెట్టి రావాలనుకుంది కాని, భర్తకు భయపడి వూరుకుంది.

ఆమెపేరు కాంతం. కాంతాన్ని చూచి— మరునాడు యిరుగుపొరుగువాళ్ళ ముఖాలు మాడుచట్లకుమల్లే నల్లబడ్డాయి. వాళ్ళల్లో రేగిన ప్రశ్నలు పలురకాలు! ఆవిడెవరు? ఏ వూరు? ఆమె భర్త ఎవరు? ఏం జేస్తుంటాడు? ఆమె ఎందుకొచ్చింది? జవాబులు ఎవరికీ తెలియవు.

నాగమ్మ వాళ్ళప్రశ్నలకు జవాబులుతోచక విసిగిపోతోంది. భర్తను మాటిమాటికీ హెచ్చరించింది. ఆ యింటిలోవున్న సామానులంతా యీయింటిలో తెచ్చిపడెయ్యమని. కృష్ణయ్య ఇదో అదో అంటూనేవున్నాడు. నాగమ్మ అనుమానం రూఢిపడిపోతోంది.

కాంతంవిషయం ఆమెకు అతి విచిత్రమనిపించింది. మొగుడంటూ లేకుంటే—యిల్లు అద్దెకుతీసుకొని వింజేసుకొంటుంది? వెంట ఒక పూచికపుల్లయినా తెచ్చుకోలేదు. భుక్తికి ఆడది ఎలా సంపాదించుకుంటుంది? ఇవన్నీ ఆమెలో అనుమానానికి దారితీశాయి ఆమె హృదయం అల్లకల్లోలమైంది.

ఇదివరకూ నాగమ్మ, కాంతం పరస్పరం పలకరించుకోలేదు. ఒకరొకరు చూసుకున్నప్పుడు సవతులకుమల్లే వైదొలగిపోతున్నారు

మూడోనాటిరాత్రి కలతజెందిన మనస్సుతో కళ్ళుమూసుకుని పడుకుంది నాగమ్మ. ఒక రాత్రివేళ హఠాత్తుగా మెలకువవచ్చింది ఆమెకు. కృష్ణయ్యా పిల్లిలా అడుగులోఅడుగు వేసుకుంటూ లేచివెళ్ళి తలుపుతీశాడు. కళ్లు తెరచి చెవులు రిక్కించి విన్నది నాగమ్మ తర్వాత అవతల యింటితలుపు తెరుచుకున్నట్టుకిర్రుమంది. కాస్సేపటివరకు గాజుల చప్పుళ్ళు, సన్నటి నవ్వులు సహించలేకపోయింది నాగమ్మ కాంతాన్ని మింగేద్దామన్నంత కోపంవచ్చింది....భర్తవచ్చి తలుపు గడియవేశాడు అడుగులో అడుగువేసుకుంటూ పరుపుమీదికివచ్చి గప్‌చిప్‌మని దుప్పటి ముసుగుతన్నాడు

నాగమ్మగుండె కుతకుత వేగిపోయింది. తనభర్తచేతనే తనకు ద్రోహమా? .... ఇంత నాటకమాడి ఏమీ తెలియనట్లే వచ్చిపడుకున్నాడు. తనకేమీ తెలియదనుకున్నాడు గాబోలు! ఎంతద్రోహం! ఎంతధైర్యం! ఈ అన్యాయానికి, అవమానానికి ఏడుపు పొంగుకొచ్చింది. ఆపుకోలేక పైకి భోరుమని యేడ్చేసింది. కృష్ణయ్యా ఉలకలేదు, పలకలేదు. తేలుకుట్టిన దొంగలా సన్నగా గురకతీశాడు.

మరునాటి ఉదయం కృష్ణయ్యా పూలరంగడిలా వెళ్లిపోయాడు .... కాంతానికి తగినవిధముగా బుద్ధిచెబితేనే గాని, నాగమ్మకు కడుపుమంట తీరదు. నేరుగా కాంతంవున్నయింట్లో దూరింది. అక్కడున్న తమ సామానులంతా ఒక్కటొక్కటే తెచ్చి యింటిలోవేసుకుంది. కాంతం కిమ్మనకుండా చూస్తూనేవుంది. ఆమె మూకీభావాన్ని యిక భరించలేకపోయింది నాగమ్మ. ఇక యిలా కాదనుకొని, యింటిలోంచి తాళంకాయా, చెవీ తెచ్చి కాంతాన్ని బయటకు రమ్మంది కాంతంరాలేదు. "నిన్నే! ఇలా బయటికి రా!...."

కాంతం వినిపించుకోలేదు.

"ఇంతవరకూ కొంపకు అగ్గిపెట్టిందిచాలక నంగనాచిలా నిలుచున్నావేమే! మర్యాదగా బయటికి నడూ" అంది నాగమ్మ యీసారి పెద్దగొంతుకతో.

తన్నుగాదన్నట్లు వుండిపోయింది కాంతం.

నాగమ్మ కోపంతో నిలువునా వూగిపోయింది. విసురుగా లోపలికెళ్ళి. కాంతం జుట్టుపట్టుకుని "నీ మొగుడి కొంపనుకున్నావా? బజారుదానా! పద బయటికి మర్యాదగా! నేనేం తెలివిమాలిందాన్ననుకున్నావా! చూస్తుచూస్తు వూరుకోటానికి? ఊ .... నడూ బయటికి" అంటూ గట్టిగా గుంజింది.

కరిచేకుక్కలు మొరగవట! అంతవరకూ నోరు నొక్కుకునివున్న కాంతం "ఛా! ఫో!" అంటూ విసరికొట్టింది నాగమ్మను. "ఏమిటే నీ తెగువ? మానం విడిచిందానా! మంచిగా బయటికెళ్లకపోతే మర్యాద చెరుచుకుంటావు" అంది నాగమ్మ కొంగు నడుముకు చుడుతూ.

"నువ్వెవతివే? నీతో నాకేంపని? ఉండమన్నాయన వెళ్ళమనాలిగానీ, నీతో నాకేం మాట? నడూ అవతలికి...." అంది కాంతం నాగమ్మను లెక్కచేయకుండా.

నాగమ్మలోని అభిమానమంతా ఒకవడితో విజృంభించింది. "నా మొగుణ్ణి వల్లో వేసుకున్నది చాలక నన్ను వెళ్లమంటున్నావా— మాయదారిముండా! ఎందరి కొంపలార్పావే యిట్లా? బయటికి కదలవే! నాయింట్లో నీకేం పనే? ఫో బయటికి...." అంటూ కాంతాన్ని పట్టి బలంకొద్దీ తోసింది.

కాంతం కదిలేరకంకాదు. నాగమ్మనుపట్టుకుని చెడామడా నాలుగుబాదింది. జుట్టుపట్టి పీకి గోళ్లతో రక్కింది. నాగమ్మ పెనుగులాడి పెనుగులాడి ప్రయోజనం లేక అవమానంతో యింటిలోకివచ్చిపడి, తన అసమర్ధతను, పరాభవాన్ని భరించలేక వెక్కివెక్కి యేడ్చేసింది.

మధ్యాహ్నం కృష్ణయ్యా భోజనానికి వచ్చి కాళ్ళు కడుక్కోడానికి పెరట్లోకి వెళుతుంటే "ఇలా ఓమారు వస్తారా?" అంది కాంతం.

కృష్ణయ్యా వెళ్ళాడు. అయిదు నిమిషాల తర్వాత తిరిగివచ్చాడు. నాగమ్మ అన్నం వడ్డించివుంచింది. కృష్ణయ్యా ఆమెకేసి చురచురా చూసి, కడపదాటుకోబోయాడు. "భోంచేయరా?" అంది నాగమ్మ.

కృష్ణయ్యా వడ్డించివున్న కంచాన్ని కోపంతో ఒక్క తన్నుతన్ని — "ఛీ! కుక్కలుగూడా ముట్టుకోవు నీ చేతి అన్నం! మెత్తగా వున్న కొద్దీ కొవ్వెక్కిపోతోంది. గుట్టుగా యింటిలో పడివుంటేవుండు. ఊళ్లోవాళ్ళమీదికి వెళ్ళావంటే ముక్కలుముక్కలుగా నరికి కాకులకూ గద్దలకూ వేస్తా! జాగర్త!" అంటూ రొప్పుతూ వాకిట్లో మంచంమీద కూలబడ్డాడు.

నాగమ్మకు తనభర్త మంచివాడనితెలుసు. అతను యింతగా మారిపోవడానికి కారణం కాంతమే! అదే అతనిమీద మచ్చుమందు చల్లింది. ఇప్పుడు ఏవేవో చాడీలుచెప్పి తన మీదికి పురికొల్పింది.

కాంతం అవతలి యింటివాకిట్లో నిలబడి చూస్తోంది. నాగమ్మకు కోపం అవధులువాటి పోయింది. తానే గనుక మగవాడైవుంటే అమెను నిలువునాచీల్చేసేది. కోపంతో బుసలు గొడుతూ వడివడిగా కాంతందగ్గరికి నడిచి వెళ్ళి "నామొగుడికేం మూరిపోశావే మంత్రాల మారీ? నువ్వెక్కడ దాపురించావే నాకు చుప్ప నాతిలాగా" అంటూ రెండుచెంపలూ చురుగ్గా వాయించేసింది.

కృష్ణయ్య ప్రళయరుద్రుడిలా పైకిలేచాడు. నాగమ్మవీపుమీద ధన్‌ధన్‌మని వరుసగా తన్నేశాడు. ఫెడేల్‌ఫెడేల్ మంటూ ముఖంమీద గుద్ది, జుట్టుపట్టుకొని బరబరాలాగి క్రింద కుదేశాడు. నాగమ్మ దెబ్బలకు తట్టుకోలేక మొత్తుకొని పెడబొబ్బలుపెట్టింది కృష్ణయ్య అమెకేకలు, అరపులు వినిపించుకోకుండా, ప్రాణం రావడం పోవడం తెలుసుకోకుండా అమెను చావగొట్టేశాడు. ఈ ఆర్భాటానికి నలుగురూ అక్కడ గుమిగూడారు. అతనిబారి నుండి నాగమ్మను విడిపించారు.

"నీకేం పోయేకాలంరా ? బంగారంవంటి పిల్లను మింగి నీళ్ళుతాగుతావు....?"

"కడుపుతోవున్న బిడ్డను చావగొట్టడానికి చేతులెలా వొచ్చాయిరా? నీచేతులుపడిపోను"

"అసలు నీకు పెళ్ళామెందుకురా ముష్టి వెధవకు?" ఇలా వయస్సుమళ్ళిన ఆడవాళ్లందరూ నానా తిట్లూతిట్టారు అతన్ని. ఎవరి ద్వారానో యీ విషయం విన్న గోవిందయ్య అక్కడికి గబగబా పరుగెత్తుకొచ్చాడు.

ఒళ్ళు హూనమయ్యేలాగా దెబ్బలుతినిపడివున్న కూతుర్నిచూసేనరికి అతని కన్నకడుపు రగిలిపోయింది. "ఒరేయ్ పూలోడా! నీకిదేం పోయేకాలంరా కులహీనుడా! ఏదో మంచి వాడనుకున్నానేగానీ, ముచ్చులావుండి ఇలా రాక్షసుడిలా ప్రవర్తిస్తావా ? తెలిసి తెలిసీ గతిలేని వాడికి అంటగట్టానే నాదితప్పు. బుద్ధిఆయినా గొప్పదిగా వుండాలి, వంశమైనా గొప్పదిగా వుండాలి. రెండూలేని నానార్థావి — దెబ్బలు వెతికే బుద్ధెక్కడికి పోతుంది? పువ్వుల్లోపెంచి ముళ్ళల్లో వుంచాను. ధూత్!" అంటూ కృష్ణయ్య మొహం నిండుకూ ఖాండ్రించి ఉమ్మేశాడు.

ఇంకా కోపం చల్లారని కృష్ణయ్య ముందు వెనుక లాలోచించక "నీ కూతురు అంత నుకుమారైతే, నీతోనే తీసుకెళ్ళు! ఇక్కడెందుకు?....నాకెందుకీ పీడ?" అన్నాడు.

"ఆమాట నువ్వు జెప్పాలేమిట్రా ముష్టి వెధవా?....ఇదో! ఇప్పుడే తీసుకువెళుతున్నా. నీకుమల్లె పూటకుగతిలేనివాణ్ణానేను? నీలాంటి కుక్కలు ఎన్ని పడిగాపులు కాస్తుంటాయో మాయింటివాకిట్లో...." అని కూతురిచెయ్యి అందుకొని—"లేమ్మా! వెళ్దాం మనింటికి! ఈ దరిద్రపుకొంపలో దేనికి?" అన్నాడు. అంత వరకు యేడ్చి యేడ్చి అలసిపోయి వెక్కిళ్ళు పెడుతోన్న నాగమ్మ "నువ్వెళ్ళునాన్నా! నేను రాను" అంది.

"ఇంకా యీ కసాయివాడిమీద ఆశపెట్టుకుంటావా తల్లీ! వీడు ఏనాటికైనా నిన్ను ఖూనీ జేసేవాడే అక్కడ నీకేమీ లోటుండదు రామ్మా! ఇక్కడుండి ఎందుకు అన్యాయంగా ఒళ్ళు పాడుజేసుకుంటావు" అంటూ గోవిందయ్య అమెను పైకి లేవనెత్తాడు.

"వెళ్ళే! నీకేం కొరత? ఇంకో మొగుణ్ణి కట్టబెడతాడులే! నేను గాకుంటే యింకొకడు. వాడుగాకుంటే మరొకడు" అంటూ అక్కసు కొద్దీ నవ్వాడు కృష్ణయ్య.

గోవిందయ్యకళ్ళు చింతనిప్పుల్లా మెరిసిపోయాయి. "ఏంకూశావురాగాడిదా!" అంటూ దుడ్డుకర్రతో బలంగా ఒక్కదెబ్బతగిలించాడు అతని తలపైన. తలకు పెద్దగాయం తగిలి రక్తం చిమ్మింది.

నాగమ్మ 'నే రా'నంటూ గింజుకొంటున్నా వినిపించుకోకుండా అమెను తన యింటికి లాక్కెళ్ళిపోయాడు గోవిందయ్య.

* * *

తాడుతెగిన గాలిపటాన్ని ఆకాశంలో నిలపడం అసాధ్యం. కృష్ణయ్యకు అడ్డు అంటూ లేకపోవడంతో అన్నిటికీ తెగించి, కాంతంతో కాపురంపెట్టాడు. గోవిందయ్య కూతుర్ని మళ్లీ పంపించలేదు. కృష్ణయ్య రమ్మని పిలువనూ లేదు.

రోజులన్నీ కాంతంమీది అభిరుచితోనే గడిచిపోతున్నాయి. నాగమ్మ కొడుకును కన్నది. తాను చూచిరావడానికన్నా వెళ్ళలేదు....చెడిపోయేవాణ్ణి ఎవరూ బాగుపరుచలేరు....కాంతం ఉదంతం కొన్నాళ్ళల్లో అందరికీ తెలిసింది అమెది వెంకటగిరి. అమె దుష్ప్రవర్తనకు విసిగి, అమెభర్త అమెను చంపివేసేంతటి పరిస్థితి యేర్పడేసరికి, బిడ్డతో దొంగతనంగా పారిపోయివచ్చేసింది. గాలానికి చేప తగులుకొన్నట్లు కృష్ణయ్య అమె వలపువలలో చిక్కుకున్నాడు.

ఏండ్లు దొర్లిపోతున్నాయి. కన్నకొడుక్కు దక్కని కృష్ణయ్య పితృత్వాన్ని కాంతంకొడుకు రమణ ఆక్రమించాడు. వాణ్ణి స్కూల్లోచేర్పించాడు కృష్ణయ్య. తనకొడుకు శివం — తన పూలదుకాణం ముందునుంచి స్కూలుకెళ్లుతోంటే చాలాసార్లు చూశాడు కానీ, పలుకరించలేదు. అతనిరోషంక్రింద పుత్రవాత్సల్యం అణగిపోయింది.

ఒక వర్షాకాలపునాటిరాత్రి తుంపర తుంపరగా వర్షంపడుతోంది. కృష్ణయ్య అంగడికట్టిపెట్టి, కండువా తలమీదుగా పరుచుకొని యింటిముఖంపట్టాడు. వెనుక ఎవరో వస్తున్నట్లు అలికిడైనా తిరిగి చూడలేదు. ఇల్లు దగ్గరపడేసరికి — "నాన్నా!" అన్న పిలుపు మెల్లగా వినిపించింది.

తిరిగిచూశాడు! తన కొడుకు శివం!

"ఏం యిలా వచ్చావు?" అన్నాడు కృష్ణయ్య. అదే మొదటిసారి మాట్లాడ్డం.

"నేనూ వొస్తాను యింటికి!" అన్నాడు శివం. వాడిముఖం నిండుకూ సిగ్గు క్రమ్ముకొనివుంది.

వీధిదీపపు వెలుగులో యిద్దరిమీదా వర్షపు చినుకులు పడుతున్నాయి జనసంచారంలేదు.

"ఇప్పుడు యింటికివెళ్ళు! మరెప్పుడైనా వద్దువుగాని."

"మరి—తాత సాయంత్రం నేను యేడుస్తుంటే—తల గట్టిగాపట్టిపూపి—ఇక్కడ ఎవరున్నారని యేడుస్తావురా వెధవా! మీ యబ్బ దగ్గరికెళ్లి యేడువు--బజార్లో పూలమ్ముకుంటున్నాడు అని తిట్టాడు. అందుకని యింట్లోంచి వచ్చేశా...."

"ఇప్పుడు వొద్దమ్మా! అక్కడేవుంటే మీ తాత నీకు యిల్లూ అదీరాసిపెడ్తాడు. అప్పుడు గావాలంటే వచ్చేయి. ఇప్పుడొచ్చేస్తే అదంతా వాళ్ళూ వీళ్ళూ తన్నుకుపోతారు. ఏం? ఇంటికి వెళ్ళిపో! ఈఅణాకు పప్పులు తీసుకుని తింటూ పో!" అంటూ అణా తీసియిచ్చాడు.

"నువ్వెళ్ళు నే వెళుతున్నా!" అంటూ వెళ్లిపోయాడు కృష్ణయ్య .... వీధి మలుపులో నిలబడి శివం వున్నాడా వెళ్ళిపోయాడా అని చూశాడు. శివం అలాగే నిలబడివున్నాడు. అంతలో గోవిందయ్య అక్కడికివచ్చి, శివాన్ని కౌగిలించుకొని "ఎక్కడెక్కడ వెతికానురా తండ్రీ నీకోసం నువ్వు కనిపించకపోయేసరికి నా కడుపులో పిడుగుబడిపోయిందిరా నాయనా! ఇక్కడేం జేస్తున్నావు బాబూ? రామ్మా యింటికెళ్దాం! అమ్మ నీ కోసం కంచములో బువ్వపెట్టుకొని కాచుకునివుంది. తిందువుగాని రారాతండ్రీ!"అంటూ బొంగురుబోతున్న గొంతుతో—వాడి తలకు గుడ్డచుట్టి, భుజంమీదికెత్తుకొని, కర్ర ఊతగా చిన్నగా నడిచివెళ్ళిపోయాడు.

కృష్ణయ్య రెండు కన్నీటిబొట్లను అప్రయత్నంగానే తుడుచుకున్నాడు.

* * *

తాను నాగమ్మను పరిత్యజించిన పది సంవత్సరాలకు తన మామగారు గోవిందయ్య మరణించాడు. బాకీలకుపోగా మిగతా ఆస్తిని నలుగురు కూతుళ్ళుపంచుకున్నారు. నాగమ్మ వాటాకు అయిదారువేలు విలువచేసే డాబా యిల్లు వచ్చింది. కృష్ణయ్య గోవిందయ్య

చావుకుకూడా రాలేదు. తరువాత ఆరునెలలు గడిచాక జరుగుబాటు ఏదీ లేకపోగా నాగమ్మ పరులయిళ్ళల్లో చాకిరీ మొదలుపెట్టింది. శివాన్ని స్కూల్‌ఫైనలుదాకా చదివించింది. అదృష్టంకొద్దీ శివానికి పాకాలలోనే ఉద్యోగం దొరికింది.

కాంతంకొడుకు రమణ అల్లరి చిల్లరగా తిరిగి చదువుకు ఎగనామంపెట్టాడు. కానీ వాడికి బ్రతుకుతెరువు వెతుక్కోవలసిన భయం లేకపోయింది. కృష్ణయ్యా బాగా సంపాదించాడు. ఆ సంపాదనే చాలు రమణకు. ఆ పెట్టుబడితోనే వ్యాపారంలో దిగాడు.

శివానికి తన చేతులారా పెండ్లిచేయవలసిన కృష్ణయ్య — శివం పెళ్ళికైనా వెళ్ళక రమణకు వైభవంగా పెళ్ళిచేశాడు. వాళ్లకూ పిల్లలు పుట్టిపోయారిప్పుడు.

తరువాత ఒకటి రెండు ఊహించని సంఘటనలు జరిగిపోయాయి. కాంతం వ్యాధిగ్రస్తురాలై చనిపోయింది. తుదిక్షణంలో ఆమె తన పాపాన్ని పశ్చాత్తాపంతో కడిగివేసుకొంది. "నీ సంసారాన్ని ముక్కముక్కలు చేశాను. నీ పెళ్ళాం పిల్లల్ని చెట్టుకొకరు, పుట్టకొకరుగా జేసి, వాళ్ళగోడుపోసుకున్నాను. దేవుడిదగ్గర ఏమని సమాధానం చెప్పుకోను నేను" అంటూ యేడ్చిందామె.

ఆమె మరణానంతరం రమణ కృష్ణయ్యతో పోట్లాటలు పెంచుకొని పుత్రకళత్రసమేతంగా వెంకటగిరికి తన మేనమామలదగ్గరికి వెళ్ళిపోయాడు.

ఇంతటిదీర్ఘకాలంలోనూ ముందు చూపన్నది లేకపోయింది కృష్ణయ్యకు. చెడి బుద్ధి మంతులౌతారట! ఇప్పుడు తాను ఏకాకి!!!

అంతా స్వాపరాధమే! పండంటి జీవితాన్ని చేజేతులా పాడుజేసుకొన్నాడు. తనచుట్టూ నరకాన్ని నిర్మించుకొన్నాడు. లోకులు దుమ్మెత్తిపోసేంతటి నీచుడుగా పరిగణింపబడ్డాడు. అబ్బ! తన మూలంగా ఎన్ని హృదయాలు గాయపడ్డాయి! ఎందరి జీవితాల్లో అసంతృప్తిరేచ్చిపోయింది! ఈనాడు కృష్ణయ్య హృదయం గతజీవితాన్నంతా పునరాలోకనం చేసుకుంటూ పశ్చాత్తప్తమైపోతోంది!

కృష్ణయ్యా రైలుకట్టమీదే నడిచిపోతున్నాడు ఎదురుగ్గా ఎవడో కుష్ఠురోగి వస్తుంటే ప్రక్కకు తప్పుకోను వీలులేక—"ఒరేయ్! అటు వెళ్ళు! థూ! ... రంగావెళ్ళు!" అంటూ అసహ్యించుకున్నాడు.

వాడు విషాదంగా నవ్వి "ఎందుకు చీదరించుకుంటావయ్యా! నేనూ ఒకప్పుడు మహారాజుగా బ్రతికాను. నేను జేసిన కర్మ నన్నీ గతికి తెచ్చింది" అంటూ వెళ్లిపోయాడు.

కృష్ణయ్యకు ఒళ్ళు జలదరించింది. తాను జేసిన కర్మ తానేవిధంగా అనుభవిస్తాడో మరి?

సూర్యుడు నెత్తికి సూటిగావచ్చి నిలిచాడు. కనుమాపుదూరాన పనపాకం రైలుస్టేషను గాబోలు కనిపిస్తొంది. అంటే తాను ఏడెనిమిది మైళ్ళు నడిచివచ్చాడన్నమాట.

కొన్ని గజాలదూరంలో రైలుకట్టకు సమానాంతరంగా తారురోడ్డు. కృష్ణయ్యారోడ్డుమీదికి వెళ్ళాడు. బాటకు ఇరువైపులా నేరేడుచెట్లు, చింతచెట్లు బారులుతీరి నిలబడివున్నాయి. బాటప్రక్కన పది గజాలదూరంలో పెద్దమఱ్ఱిచెట్టు. బస్సుప్రయాణీకులు వేచి వుండడం కోసం రాతిపలకలతో యేర్పరచిన రెండు తిన్నెలు, ప్రక్కన చిన్నఅంగడి టీకొట్టు.

ఆకలిబాధచేత శరీరం నిస్సత్తువగావుంది. తేలిగ్గా అడుగులు వేసుకుంటూ, మఱ్ఱిచెట్టు క్రిందికివచ్చి ఆగాడు కృష్ణయ్య. కొంతమేర శుభ్రంచేసి, ఒకరాతిని తలగడగా పెట్టుకొని పడుకున్నాడు.

అక్కడక్కడా — ఎవరో వంటచేసుకున్నట్లు - బొగ్గులు, పొయ్యిరాళ్ళు, పడివున్నవి. ఈ చెట్టు ఎందరు అనాధులకు ఆశ్రయమిచ్చిందో! తనకూ యిప్పుడు ఆశ్రయమిచ్చింది. తాను దిక్కులేనివాడు. తనవారు అని చెప్పుకోదగ్గ వారెవరూ లేరు. తాను భిక్షగాడు! ఎంతమంది ముష్టెత్తుకొని బ్రతకటం లేదు? తానూ అంతేనా యిక?....

అతని మనోభారాన్ని ఉపశమింప జేసేందుకన్నట్లు ఆ చల్లటి నీడలు అతనికి సుఖనిద్రను ప్రసాదించాయి.

* * *

మూడురోజులు గడిచాయి.

ఈ మూడు రోజుల్లో ఆ వృద్ధుడు చాలా మారిపోయాడు. ఎందరో అతన్ని పలుకరించారు. కాని పులకడు, పలుకడు. జీవచ్ఛవంలా అక్కడే పడివుంటాడు. పిచ్చిపిచ్చిగా గొణుగుతాడు, ఏడుస్తాడు. కాస్సేపు తనలో తానే నవ్వుకుంటాడు. గంటల తరబడి శూన్యములోకి చూస్తూ వుండిపోతాడు... తనపాదాల దగ్గర కూలి పోయిన ఆ శరణార్థుని పైకెత్తుకొని ఓదార్చలేక మర్రిచెట్టు ఆక్రోశిస్తుంది.

దయతలచి ధర్మాత్ములెవరైనా కాసులో, పైసలో పడవేస్తే - దాన్నిముట్టుకోడు 'పాపం ముసలివాడు - ఆకలితో చచ్చిపోతా'డని జాలిపడి, పండో ఫలహారమో యిస్తే అరగించడు. ఒకటే ఏడుపు! ఎందుకో?....

అతని శరీరం మూడురోజుల ఉపవాసానికి గడ్డిపోచల్లో ఒక పోచగా, ఎండుటాకుల్లో ఒక ఆకుగా తయారైంది. అతని నేత్రాలు ఆరిపోవడానికి సిద్ధంగావున్న జ్యోతుల్లా వున్నాయి. అతని ముఖం రంగుపూసిన పుర్రెలా వుంది. అతని కడుపు ఎండిపోయి, వంచిన విల్లులా వుంది. మూడుపగళ్ళు, మూడు రాత్రులు ఆకటితో, చలితో పోరాడుతూ-ఆ మర్రిచెట్టు క్రింది నుంచి కదలనైనాలేదు.

నాలుగో రోజు ఉదయం గొణుగుకోడానికతనికి శక్తిలేకపోయింది. ఏడ్చే ఓపికకూడా చచ్చిపోయింది. బలిపశువు చుట్టూ గుమిగూడారు. అందరి నోళ్ళనుండి వెలువడిన సానుభూతి వాక్యం —"ఎక్కడ పుట్టాడో, ఎంతబ్రతుకు బ్రతికాడో - పాపం యిక్కడికొచ్చి దిక్కులేనిచావు చావాలని అడిగి వచ్చినాడు...."

....ఆ జనసమూహాన్ని చీల్చుకొని ఒక యువకుడు అతని దగ్గరకు వచ్చాడు. అందరునూ విభ్రాంతితో చూస్తూన్నారు. ఆ యువకుడు వృద్ధుణ్ణి బస్సులోకి చేరవేశాడు. ఇదేమీ ఆ ముసలివాడికి తెలియదు....

* * *

మరణ శయ్యమీద చివరిసారిగా కళ్ళు తెరచి చూశాడు కృష్ణయ్యా. విషాద వదనంతో చేతులు గట్టుకొని నిలబడివున్న తన కొడుకు శివం, కన్నీరుమున్నీరుగా విడుస్తోన్న అర్ధాంగి నాగామ్మ మసక మసకగా కనిపించారు. నోరు తెరచి ఏదో ప్రార్థించబోయాడు. నోరుపెగలలేదు. చేతులెత్తి మొక్కబోయాడు. చేతులు కదలలేదు. నయనాల్లోని అశ్రుభాండాలు బ్రద్దలై, అతని శుష్కవదనం మీద కన్నీరు మాత్రం ధారగా స్రవించి, మరునిమిషంలో ఆగిపోయింది. అతను వెళ్ళిపోయాడు - తన వారికి దూరంగా, శాశ్వతంగా!....

పాపం - పూలకృష్ణయ్యా!

స్వహస్తాలతో అందమైన పూలదండలు కోకొల్లలు అల్లిన పూలక్రిష్ణయ్య - తన జీవిత సుమహారాన్ని గ్రుచ్చి కట్టుకోలేకపోయాడు !

(సమాప్తం)


# కాలు ఆణి మందు

కాళ్లలో యేర్పడు ఆణికి యీ దివ్యమైన ఔషధమును ప్రతిరోజు పైన చరుముకొని వచ్చినచో ఆణియొక్క మొలకను బయటికి తీసివైచి స్వస్థపరచును. మరల యెప్పటికిని కాలిలో ఆణి రానేరదు. బాగుగ మామూలు ప్రకారము పాదములు అణచి నడచుటకు వీలుపడును.

బుడ్డి 1-8 రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

తపాల్‌పెట్టె నెం. 1376, మదరాసు-1.